

### లింకేజీ రుణాల పంపిణీ

సాక్షి, పాడేరు: రూడకోటకు చెందిన 115 గ్రూపులకు రూ.1.13 కోట్ల లింకేజీ రుణాల చెక్కును కలెక్టర్ సుమిత్‌కుమార్ అందజేశారు.



### సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని జి.మాడుగుల ఎంపీడీవో చంద్రశేఖరరావు ఆదేశించారు. 11లో



### గిరిజనుల అభ్యున్నతే లక్ష్యం

గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాగులపల్లి ధనలక్ష్మిపేర్కొన్నారు. 11లో

## న్యూస్‌రీల్

### విద్యార్థుల అరకొర హాజరుపై ఆగ్రహం

- వారం రోజుల్లో పరిస్థితి మెరుగుపడాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



కొయ్యూరు ఆశ్రమ పాఠశాల-2లో నిత్యావసర సరకుల బరువు చూస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

కొయ్యూరు: పాఠశాలలు తెరిచి 13 రోజులు దాటినా ఇప్పటికీ అరకొర విద్యార్థులు రావడంపై ఐటీడీఏ పీవో అభిషేక్ ఆగ్రహానికి గురయ్యా రు. గురువారం రాత్రి ఆయన కొయ్యూరు మండలం లో పర్యటించారు. దీనిలో భాగంగా స్థానిక గురుకుల పాఠశాల, ఆశ్రమ పాఠశాల -2, ఏకలవ్య పాఠశాలను ఆయన సందర్శించా రు. కనీసం 30 శాతం మంది కూడా లేకపోవడంతో గ్రామాలకు వెళ్లి పిల్లలను ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. వారంరోజుల్లోగా పిల్లలందరూ పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలోనే మళ్లీ వస్తానని, అప్పటికీ పూర్తిగా మార్పు కనిపించాలని ఆదేశించారు. కొయ్యూరు ఆశ్రమ పాఠశాల– 2లో నిత్యావసర సరకుల తూకం పరిశీలించారు.

### 27న రంపచోడవరంలో మినీ జాబ్ మేళా

అడ్డతీగల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27 న మంగళవారం రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ మినీ జాబ్ మేళాలో డిమార్ట్, ఈ కామ్ ఎక్స్‌ప్రెస్, కేర్ ఫర్ యు కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. జిల్లాలోని 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగి పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ ఆపై చదువులు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇంటర్వ్యూకి పాన్‌కార్డు, ఆధార్‌కార్డు,విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ జీతభత్యాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 6304634447 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

### వాంతులు, విరేచనాలతో విద్యార్థి మృతి



కొడుకు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

గూడెంకొత్తవీధి: పెద అగ్రహారంలో ఏడేళ్ల విద్యార్థి వాంతులు విరేచనాలతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. రెండో తరగతి చదువుతున్న గొర్రె శంకరరావు గురువారం రాత్రి ఉన్నట్టుండి వాంతులు, విరేచనాలు అస్వస్థతకు గురయ్యాడు. తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా ఇంతలోనే ఆరోగ్యం విషమించింది. కొడుకు మరణాన్ని తట్టుకోలేక తల్లిదండ్రులు బాబూరావు, లక్ష్మి బోరున విలపించారు. మృతుడికి ముగ్గురు సోదరిలు ఉన్నారు.

### పోలీసుల ముమ్మర తనిఖీలు



రాజేంద్రపాలెం అల్లూరి స్మారక పార్కు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

కొయ్యూరు: మండలంలో శుక్రవారం స్థానిక పోలీసులు డాగ్ స్క్వాడ్, ఏపీఎస్పీ బలగాలతో కలిసి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. వచ్చే నెల నాల్గవ తేదీన అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు మంత్రులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో కొయ్యూరు సంత పాకలు, బూదరాళ్ల వంతెన, మంప, రాజేంద్రపాలెం అల్లూరి స్మారక పార్క్ పరిసర ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించారు. వంతెనలు, రహదారులను క్షుణ్ణంగా పరిశీలించారు.

# ఆస్పత్రుల్లో ఆహారం

వైద్యసేవలకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రోగులకు అందించే భోజనం విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఇందుకు కేటాయించే రోజువారీ నిధులను రెట్టింపు చేసింది. రుచికరంగా, నాణ్యమైన భోజనాన్ని ఆస్పత్రుల్లో అందిస్తుండటంతో రోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- నాణ్యత, రుచికరంగా భోజనం
- నిధులను రెట్టింపు చేసిన ప్రభుత్వం
- రోగులు, సహాయకుల్లో ఆనందం



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో రోగులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

**జిల్లా సమాచారం**

| | | |
|---|---|---|
| మండలాలు | : | 22 |
| జిల్లా ఆస్పత్రి | : | 1 |
| ఏరియా ఆస్పత్రులు | : | 3 |
| సీహెచ్‌సీలు | : | 5 |
| పీహెచ్‌సీలు | : | 62 |

ముంచంగిపుట్టు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్న ప్రభుత్వం.. చికిత్స పొందే రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందించేందుకు సంకల్పించింది. రోగులకు అందించే ఉచిత భోజనం రోజువారీ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. గతంలో రూ.40 ఉన్న మొత్తాన్ని రూ.80 నుంచి రూ.వంద చేసింది. దీంతో నెలరోజులుగా రోగులకు మరింత నాణ్యమైన భోజనం అందుతోంది.

➡ ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలు, రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టేవారు. ఇందుకు గతంలో ప్రభుత్వం రూ.40 చెల్లించేది. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరల నేపథ్యంలో ప్రభుత్వం చెల్లించే సొమ్ము సరిపోయేది కాదు. సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం భోజన ఖర్చును రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

**భోజన మెనూ వివరాలు**

| | | |
|---|---|---|
| ఉదయం | : | ఇడ్లీ, రాగి మాల్ట్, టమాటా బాత్, బ్రెడ్(వీటిలో ఏదొకటి), అదనంగా 100 ఎంఎల్ పాలు. |
| మధ్యాహ్నం | : | అన్నం, కూర, సాంబారు, ఉడక బెట్టిన గుడ్డు, అరటి పండు. |
| రాత్రి | : | అన్నం, కూర, సాంబారు, ఉడకబెట్టిన గుడ్డు, అరటి పండు, |
| గర్భిణులు, బాలింతలు | : | అన్నం,ఆకుకూర పప్పు, గుజ్జు కూర, సాంబారు, మజ్జిగ, ఉడకబెట్టిన గుడ్డు, అరటిపండు, వేరుశనగ పట్టీ, రాగిజావ, వీటితో పాటు వారానికి రెండు చికెన్, రోజుకు ఒక పండు. |

➡ రోగితో వచ్చే సహాయకులకు సైతం భోజనం, వసతి కల్పించాలని ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆస్పత్రులకు వచ్చే రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**గత ప్రభుత్వంలో..**

గత ప్రభుత్వంలో ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు అందించే ఆహారం(డైట్)పై అంతగా దృష్టిసారించలేదు. భోజనానికి అయ్యే ఖర్చులు నామమాత్రంగానే చెల్లించేవారు. దీంతో నాణ్యత లేని ఆహారం రోగులకు అందేది. కొంత మంది రోగులు తినలేక సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లి భోజనం చేసేవారు. ఆ సౌకర్యం లేని వారు ఆస్పత్రిలో ఇచ్చే భోజనమే మహాప్రసాదంగా భావించేవారు.

**నిత్యం పర్యవేక్షణ**

పెంచిన చార్జీల ప్రకారం భోజనం రోగులకు అందుతుందా లేదా అనే అంశంపై ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసింది. దీనిలో భాగంగా నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించింది. ఈ మేరకు అధికారులు భోజనం తయారీ దగ్గర నుంచి రోగికి అందించే వరకు నాణ్యత, తనిఖీలు, రికార్డుల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**భోజనం చాలా బాగుంది**



ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో చేరా. టైఫాయిడ్ అని నిర్ధారణ అయింది. దీంతో ఆస్పత్రిలో చేరా. వైద్యసేవలతో పాటు రోగికి ఇస్తున్న ఆహారం ఎంతో బాగుంది. మూడు రోజులుగా నేను, భర్త ఉంటున్నాం. ఇద్దరికి భోజనం ఇస్తున్నారు. మంచి భోజనం అందిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– కె.గొల్లమ్మ, రోగి, చికుచింత, ముంచంగిపుట్టు మండలం

**నాణ్యతగా ఉండేలా చర్యలు**



ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు అందించే భోజనం నాణ్యతగా, రుచిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. భోజనం అందించే విషయంలో ఎటువంటి లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. మెనూ ప్రకారం అందేలా ఏర్పాట్లు చేశాం.

– జమాల్‌బాషా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, పాడేరు

## తల్లి మరణం తట్టుకోలేక..

- ఆగిన కుమార్తె గుండె
- పెద అగ్రహారంలో విషాదం



తల్లి, కుమార్తె మృతదేహాలు

గూడెంకొత్తవీధి: తల్లిమరణాన్ని తట్టుకోలేక కూతురు కూడా నాలుగు గంటల వ్యవధిలో ప్రాణాలు విడిచింది. గూడెం పంచాయతీ పెద అగ్రహారంకు చెందిన గెమ్మెలి కొత్తమ్మ(80) గురువారం సాయంత్రం అనారోగ్యంతో మరణించింది. ఆమె కూతురు కొర్రా పూర్ణమ్మ అదే ఇంట్లో ఉంటోంది. తల్లి మరణాన్ని పూర్ణమ్మ(48) తట్టుకోలేక పోయింది. తల్లి మృతదేహం వద్ద కుప్పకూలిన ఆమెను 108లో చింతపల్లి తరలించారు. అక్కడ నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా డౌనూరు సమీపంలోకి వచ్చేసరికి ప్రాణాలు విడిచింది.తల్లి చనిపోయిన నాలుగు గంటల వ్యవధిలోనే కూతురు కూడా మరణించడంతో చిన అగ్రహారంలో విషాదం నెలకొంది. కొత్తమ్మకు నలుగురు కొడుకులు, కుమార్తె పూర్ణమ్మ ఉన్నారు.చాలా కాలంగా కుమార్తె పూర్ణమ్మ ఇంటి వద్ద కొత్తమ్మ ఉంటోంది. ఇద్దరు ఒకే రోజు నాలుగు గంటల వ్యవధిలో మృతి చెందడం గ్రామస్తులను కలచివేసింది.

# జగనన్న సురక్ష విజయవంతానికి కృషి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- సీఎం ప్రసంగాన్ని వీక్షించిన జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు





సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ

సాక్షి,పాడేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని జిల్లాలోని విజయవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టామని, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జగనన్న సురక్ష పథకాన్ని శుక్రవారం తాడేపల్లి నుంచి సీఎం జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగాన్ని కలెక్టర్‌తో పాటుగా విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు వీక్షించారు. జిల్లాలో జగనన్న సురక్ష పథకం అమలుకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కలెక్టర్ వివరించారు. ప్రతి మండలాల్లో రెండు బృందాలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని కలెక్టర్ వివరించారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులంతా జగనన్న సురక్ష పథకంలో పాల్గొని, ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలానికి ప్రత్యేకాధికారిని నియమించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలోని డీఆర్వో అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమం**



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: అర్హులందరికీ పథకాలు అందజేయడమే జగనన్న సురక్ష లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం జగనన్న సురక్ష పథకం ప్రారంభం సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంలో భాగంగా వలంటీర్లు వారికి కేటాయించిన ఇళ్లను సందర్శించి వారి అవసరాలను గుర్తించాలని సూచించారు. ఈ మేరకు వారితో గ్రామసచివాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. అనంతరం నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లను గుర్తించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, వాణిజ్య విభాగం జిలా అధ్యక్షుడు ఒంటుబు సామ్యూల్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం .విశ్వేశ్వరరావు, సీడీపీవో బాలచంద్రమణి దేవి పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- అధికారులు, సిబ్బంది కృషి కీలకం
- ఎస్పీ తుహిన్ సిన్హా



అల్లూరి స్మారక భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

రాజవొమ్మంగి: గంజాయి తదితర మాదకద్రవ్యాల అక్రమరవాణా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో సిబ్బంది కృషి ఎంతో కీలకమని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈప్రాంత పోలీసు అధికారులు, సిబ్బంది కృషి వల్ల గతంలో కంటే గంజాయి తదితర అక్రమ రవాణాలను గణనీయంగా అరికట్టగలుగుతున్నామన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రక్షణపరమైన జాగ్రత్తలపై సీఐ షేక్ బాజీలాల్, ఎస్‌ఐలు గోపీనరేంద్రప్రసాద్, షరీఫ్‌లకు పలు సూచనలు ఇచ్చారు. రాత్రి పూట స్టేషన్ చుట్టూ వెలుతురు బాగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఈ ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండేదని, ఈ కారణంగా ఏరియా డామినేషన్, కూంబింగ్, ప్రత్యేక నిఘాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అల్లూరి స్మారక భవనంగా తీర్చిదిద్దిన రాజవొమ్మంగి పాత స్టేషన్‌ను ఆయన పరిశీలించారు.అల్లూరి జాతీయ యువజన సంఘం ఏర్పాటు చేసిన తైలవర్ణ చిత్రాలను పరిశీలించారు. ఇంతటి గొప్ప పేరున్న స్టేషన్‌లో పనిచేయడం మీ అదృష్టం అని సిబ్బందిని అభినందించారు. అల్లూరి వర్థంతిని ఘనంగా జరుపుతామన్నారు. సాయుధ పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, పాల్గొన్నారు.

# ఐటీడీఏ స్పందనకు వినతుల వెల్లువ



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన, స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ 170 వినతులను స్వీకరించారు. వీటి సత్వర పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

**అర్జీల్లో కొన్ని..**

➡ పెదబయలు మండలం బొంగరం పంచాయతీ మెట్టలగుమ్మి గ్రామంలోని ఉపాధి పనులకు సంబంధించి, వీఆర్‌పీ చినతల్లి, సక్రమంగా మస్టర్లు వేయటం లేదని గ్రామస్తులు విశ్వనాథం, చిన్నారావు ఫిర్యాదు చేశారు.

➡ జీకేవీధి మండలం జర్రెల పంచాయతీ గూనుకురాయి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, జర్రెల డీఆర్‌డీపోకు భవనం మంజూరుచేయాలని సర్పంచ్ నాగరాజు వినతి పత్రం అందజేశారు.

➡ అటవీ భూములకు హక్కు పత్రాలు మంజూరుచేయాలని డుంబ్రిగుడ మండలం పోతంగి, కించుమండ గ్రామాలకు చెందిన కమ్మిడి నిర్మల, చిన్నయ్యలు కోరారు.

➡ పనసలపాడు వరకు రోడ్డు నిర్మించాలని జి.మాడుగుల మండలం పెదలోచలి పంచాయతీ గొడ్డుగుర్రాలబంద గిరిజనులు కోరారు.

➡ తమ గ్రామం నుంచి పాతవీధి వరకు రోడ్డు నిర్మించాలని చింతపల్లి మండలం అంజలిశనివారం పంచాయతీ మదేలబంద గిరిజనులు విన్నవించారు.

## వందేళ్ల వట వృక్షం



ఊడలతో భారీ మర్రి చెట్టు

అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ గ్రామ సమీపంలోని కొలువై ఉన్న పెద్ద దేవత గుడి వద్ద మర్రిచెట్టుకు విశిష్టత ఉంది. ఈ వృక్షానికి సుమారు వందేళ్లు పైబడి ఉంటుందని స్థానికులు తెలిపారు. 20 నుంచి 30 అడుగుల పొడవు గల ఈచెట్టు వద్ద ఏటా మార్చిలో టోకూరు గ్రామస్తులు గ్రామదేవత పండగ నిర్వహిస్తుంటారు. ఈ ప్రాంతానికి వచ్చిన వారు మహా వృక్షాన్ని ఆసక్తి తిలకిస్తుంటారు.

## సాంకేతిక పద్ధతులతో మంచి ఫలితాలు



రంపచోడవరంలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తదితరులు

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: గిరిజన రైతులు వ్యవసాయం రంగంలో వచ్చిన సాంకేతిక పద్ధతులను అవలంభించి నాణ్యమైన పంట దిగుబడి సాధించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. శాస్త్రవేత్తల పరిశోధనలు రైతులకు ఉపయోగపడాలన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మార్టేరు వారు టీఎస్‌పీలో భారతీయ వరి పరిశోధన సంస్థ హైదరాబాద్ సౌజన్యంతో వరి విత్తనాలు ఉచిత పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మార్టేరు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి 1318 ఎంటీసీ వరి విత్తనాలు అభివృద్ధి చేశారని తెలిపారు. వీటిని దేవీపట్నం, రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు సంబంధించిన సుమారు 200 మంది గిరిజన రైతులకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క రైతుకు 30 కేజీల వరి విత్తనాల చొప్పున సుమారు ఆరు టన్నులు అందజేశామన్నారు. కోతుల నిర్మూలనకు సోలార్ పెన్సింగ్ వాడాలన్నారు. రైతులకు సంబంధించిన వివరాలను సంబంధిత గ్రామ సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపీపీ బంధం శ్రీదేవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి అనువైన వరి విత్తనాలను ఉచితంగా సరఫరా చేయడం అభినందనీయమన్నారు. రంపచోడవరం జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరి రైతులు అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలుచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం భరత్‌లక్ష్మి, బి శ్రీనివాసరావు. యం. శ్రీనివాసరావు. కృష్ణాజీ, ఆనంద్ కుమారి. ఏడీ సీహెచ్‌కేవీ చౌదరి, ఏవో లక్ష్మణ్, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, కుంజం వంశీ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర రహదారిలో కూలిన భారీ వృక్షం

- నిలిచిపోయిన రాకపోకలు
- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు



రహదారిపై కూలిన భారీ వృక్షం





నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా) : జిల్లాలోని అంతర్ రాష్ట్ర రహదారి సీలేరుకు 10 కిలోమీటర్ల దూరంలో వలసగడ్డ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున భారీ వృక్షం కూలిపడింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 12 బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెట్టుకూలి 14 గంటలు కావస్తున్నా తొలగిచేందుకు సంబంధిత అధికారులు స్పందించలేదు. దీంతో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాదారులు రోడ్డుపై నానా అవస్థలు పడ్డారు. విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్లి వచ్చే బస్సులో ప్రయాణికులను మార్చి గమ్యానికి చేర్చారు. కొన్ని ప్రైవేటు వాహనాలు వెనక్కి వెళ్లిపోయాయి. మరి కొందరు నడిచి సీలేరు చేరుకున్నారు. కనీసం బైకు కూడా వెళ్లడానికి దారి లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురయ్యారు. 60 ఏళ్లనాటి భారీ వృక్షం కావడంతో దాని మొదలు చాల పెద్దదిగా ఉంది. దీనిని తొలగించేందుకు భారీ యంత్రాలు అవసరం కావల్సి ఉండటంతో ఎవరు పట్టించుకోలేదు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు కూడా చెట్టు అలాగే ఉంది. విశాఖపట్నం, భద్రాచలం, పాడేరు, డొంకరాయి, రాజమహేంద్రవరం, జైపూర్ నుంచి భద్రాచలం, భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులన్ని తిరిగి వెళ్లిపోయాయి.

## గిరి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

పెదబయలు: ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో రూ.4 లక్షల జెడ్పీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో జెడ్పీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి కల్పన ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. జెడ్పీ నిధులను మండలాల వారీగా కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. సీతగుంట పంచాయతీలో వారపు సంతను ఆనుకొని పాత అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే మట్టిరోడ్డును రూ. లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీనికి కూడా శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. పెదబయలులో జెడ్పీ అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుందన్నారు. దీనికి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ప్రతిపాదనల్లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం త్వరలోనే కార్యరూపం దాల్చుతుందన్నారు. సర్పంచ్ పలాసి మాధవరావు, మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం పాల్గొన్నారు.

# ఘాట్‌రోడ్డులో నిలిచిన ట్రాలీ

- గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు


ఘాట్ రోడ్డులో అడ్డంగా నిలిచిపోయిన ట్రాలీ

**మారేడుమిల్లి:** మారేడుమిల్లి–చింతూరు ఘాట్‌రోడ్డులో రహదారికి అడ్డంగా శుక్రవారం ఓ ట్రాలీ ఇరుక్కుపోయింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఒడిశాకు చెందిన భారీ ట్రాలీ రాజమండ్రి నుంచి ఒడిశాకు వెళ్తుండగా వాలిసుగ్రీవ మలుపు వద్ద తిరుగుతుండగా అడ్డంగా ఇరుక్కుపోయింది. అదే సమయంలో భద్రాచలం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు మలుపులో ట్రాలీ అడ్డంగా ఉండడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో రోడ్డు పక్కనే గొయ్యిలోటైర్లు దిగబడిపోయాయి. దీంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గంటల తరబడి ప్రయాణికులు రోడ్డుపై పడిగాపులు కాస్తు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం ట్రాలీని పక్కకు తప్పించడంతో రాకపోకలు యధావిధిగా సాగాయి. ఉదయం నిలిచిపోయిన ట్రాఫిక్ సాయంత్రానికి క్లియర్ అయింది.

# ఇంటికే పోషకాహారం పంపిణీ

మహిళ శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి

**పెదబయలు:** రాష్ట్ర వ్యాప్తంగా జూలై 1 నుంచి ఇంటికే పోషకాహారం అందించడం జరుగుతుందని మహిళ శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి అన్నారు.శుక్రవారం పెదబయలు మండలం ఐసిడీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తల, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 10,504 మంది గర్భిణులు, 11,319 మంది బాలింతలకు జూలై 1 నుంచి ఇంటికే పౌష్టికాహారం అందించనున్నామన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పథకాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర్ బాలికలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడారు. బాలింతలు, గర్భిణులకు జూలై 1 నుంచి నెలకు సరిపడే సరకులు బియ్యం వంట నూనెతో పాటుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టు అందిస్తామన్నారు.15 రోజులకు ఒకసారి 12 గుడ్లు, పాలు ఇంటికే అందించాలని సూచించారు.

**అంగన్‌వాడీ కేంద్రాల్లో అధునాతన సదుపాయాలు**

నాడు–నేడు పథకంలోఅంగన్‌వాడీ కేంద్రాల రూపరేఖలు మారుతున్నాయని, నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఈ పథకంతో అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కేంద్రాలకు వచ్చే పిల్లలకు మంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించే లక్ష్యంగా పనులు జరుగుతున్నట్టు తెలిపారు. ప్రీ ప్రైమరీ స్కూల్ నిర్వహణ మరింతా బాగా జరగాలని, విద్యార్థులకు అక్షరాలు నేర్పించడం ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, కేంద్రాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటుగా క్రమం తప్పకుండా వ్యాధినిరోదక టీకాలు అందించాలన్నారు. గర్భిణులు ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న, మహిళ శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి

# మెరుగైన విద్య అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో పుష్పవతి

**పెదబయలు:** మండలంలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో మెరుగైన విద్య అందించాలని ఎంఈవో–2 గుమ్మ పుష్పవతి అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమె ఉపాధ్యాయులు, హెచ్ఎంలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముంచంగిపుట్టు జోలాపుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తూ ఇటీవల ప్రభుత్వం కల్పించిన పదోన్నతుల్లో ఎంఈవో–2గా విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన ఎంఈవో కె.సింహాచలం అనకాపల్లి జిల్లా చోడవరం ఎంఈవోగా బదిలీ అయ్యారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని ఎంపీడీవో పూర్ణయ్య కోరారు. ఉపాధ్యాయులు శాలువా కప్పి సన్మానించారు. ప్రిన్సిపాల్ శంకర్‌రావు, ఉపాధ్యాయులు సువర్ణరాజు, లలితశంకరం, ఉమామహేశ్వరరావు, దామోదరం, ఈశ్వరరావు పడాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య పాఠశాల తాళ్లపాలెం తరలింపు


కొయ్యూరు గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న ఏకలవ్య పాఠశాల భవనం

**కొయ్యూరు:** మూడేళ్ల కిందట మండలానికి మంజూరైన ఏకలవ్య పాఠశాలకు సొంత భవనం లేక తాత్కాలికంగా రాజవొమ్మంగి మండలంలో తాళ్లపాలెంకు తరలిస్తున్నారు. రాజవొమ్మంగిలో ఏకల్యవ పాఠశాల కొనసాగుతోంది. తాళ్లపాలెంలో పాఠశాల నిర్వహణకు వీలుంటుందని పలువురు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు తెలిపారు. ఈ విషయాన్ని రంపచోడవరం పీవో సూరజ్ గనోరేతో మాట్లాడారు. ఆయన స్పందించి తక్షణమే భవనం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని రాజవొమ్మంగి ఏటీడబ్ల్యూవోను ఆదేశించారు. దీంతో ఆయా భవనాలను కొయ్యూరు ఏకలవ్య పాఠశాలకు కేటాయించనున్నారు. మండలంలో బాలారంలో ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణానికి స్థలాన్ని సైతం అందజేశారు. కొయ్యూరు గురుకుల పాఠశాలలో రెండు గదులతో ఉన్న భవనంలో ఇంత వరకు 6,7 తరగతులను బాలురతో నిర్వహించగా, ప్రస్తుతం 8వ తరగతికి చేరింది. వసతి లేకపోవడంతో బాలికలకు చింతపల్లి వైటీసీలో తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే తాళ్లపాలెంలో భవనాలకు మార్చడంతో అక్కడికి తరలించనున్నారు. దీనిపై ఏటీడబ్ల్యూవో క్రాంతి మాట్లాడుతూ తాళ్లపాలెంనకు ఏకలవ్య పాఠశాలను తరలిస్తున్నట్టు చెప్పారు. బాలారంలో భవనం నిర్మాణం పూర్తి కాగానే తిరిగి తీసుకువస్తామన్నారు.

# వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులు


వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

**కూనవరం:** జనసేన పార్టీ మండల కార్యదర్శి కొట్టే దీపక్ ,కొట్టే నాగరాజు, తోటమళ్ల ప్రశాంత్ కుటుంబాలు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. చూచిరేవుల పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయ కుటుంబాలను ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

# ఐక్య ఉద్యమానికి సిద్ధం కావాలి


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

**చింతూరు:** పోలవరం ప్రాజెక్టు సమస్యల పరిష్కారం కోసం నిర్వాసితులంతా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం మహా పాదయాత్ర శుక్రవారం చింతూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాత్రి చింతూరు మెయిన్‌రోడ్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి బీజేపీ ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో నిర్వాసితులకు పరిహారం అందడంలేదని, పునరావాసం కల్పించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రానున్న వరదలకు ముందస్తు ప్రణాళికలు చేపట్టి ముంపు గ్రామాల ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, నిర్వాసితులకు త్వరితగతిన పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. సురేష్, శ్రీనివాసరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని ఆత్మహత్య

**కొమ్మాది:** 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 4వ వార్డు బీచ్‌రోడ్డు తిమ్మాపురంలోని ఓ విద్యార్థిని రుషికొండలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివింది. మొదటి సారి 10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైంది. ఈ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో మనస్తాపానికి గురై ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు సమాచారం లేదన్నారు.




**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీ లించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



# చిత్రలేఖనంలో ప్రపంచస్థాయిలో ప్రతిభ


చిత్రకారుడు శ్రీనివాసరావు


ప్రపంచ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన శ్రీనివాసరావు గీసిన చిత్రం



శ్రీనివాసరావుకు సంస్థ పంపిన సర్టిఫికెట్

**సీతంపేట:** ఫాదర్స్ డే సందర్భంగా దుబాయ్‌కి చెందిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్‌ల సంస్థ వ్యవస్థాపకుడు అనిల్ కేజ్రీవాల్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన చిత్రలేఖన పోటీలో నగరానికి చెందిన కనుమూరి శ్రీనివాసరావు ప్రపంచస్థాయిలో ద్వితీయ బహుమతి పొందారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఒక తండ్రి ఆ బిడ్డను వివిధ దశల్లో ఎంత ప్రేమగా చూసుకుంటాడో అద్దంపట్టేలా శ్రీనివాసరావు గీసిన చిత్రం ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందింది. కళంకారి చిత్రకళకు సంబంధించిన మోటిఫ్స్‌ను మేళవించి రూపొందించిన అద్భుత చిత్ర కళాఖండం జ్యూరీ సభ్యుల మనుసు దోచుకోవడంతో ప్రపంచస్థాయిలో రెండో స్థానం దక్కించుకుంది. 16 ఏళ్లలోపు ఉన్న వారంతా చైల్డ్ ఆర్టిస్ట్ క్యాటగిరి, ఆపైబడిన వారిని చిత్రకారుల కేటగిరిలో పోటీలు నిర్వహించారు. 10 దేశాలకు చెందిన 200 మంది చిత్రకారులు పోటీపడగా జ్యూరీ స్కోర్, ఆన్‌లైన్ ఓట్ల ఆధారంగా శ్రీనివాసరావు గీసిన చిత్రానికి రెండో స్థానం లభించింది. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను సంస్థ ఆన్‌లైన్‌లో పంపింది. ఈ సందర్భంగా చిత్రకారుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లి బిడ్డను 9 నెలల పాటు కడుపులో మోస్తుంది, కానీ తండ్రి చివరి శ్వాస వరకు బిడ్డను ఎల్లప్పుడూ తన భుజంపై మోస్తూంటాడన్నారు. తండ్రి అనే వ్యక్తి ప్రతి కుంబానికి వెన్నుముక అని, భారతదేశంలో ఎక్కువగా తండ్రి మాత్రమే సంపాదించే వ్యక్తిగా మొత్తం కుటుంబాన్ని చూసుకుంటాడని తెలిపారు. తమ కుటుంబాలు సంతోషంగా ఉండాలని చాలామంది తండ్రులు డబ్బు సంపాదన కోసం, ఉద్యోగ పరంగా కుటుంబానికి దూరంగా పనిచేస్తుంటారని, అటువంటి నాన్నలందరికీ తన చిత్రం అంకితం ఇస్తున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని ఆర్‌బీఎం యూపీ స్కూల్‌లో ఒప్పంద ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శ్రీనివాసరావు సాధించిన ఈ విజయంపై సహోద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# 1998, 2008 బ్యాచ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్


ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో చంద్రకళ, అధికారులు

**ఆరిలోవ:** జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ ఆధ్వర్యంలో శుక్రవారం డీఎస్సీ 1998, 2008 బ్యాచ్‌ల ఉపాధ్యాయులకు శుక్రవారం కౌన్సెలింగ్ జరిగింది. డీఎస్సీ 1998 బ్యాచ్ ఉపాధ్యాయులు 301 మంది, 2008 బ్యాచ్ ఉపాధ్యాయులు 186 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. సుమారు రెండేళ్లుగా పనిచేస్తున్న 2008 బ్యాచ్ ఉపాధ్యాయులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, 1998 బ్యాచ్ వారికి కు మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ చేపట్టి ఉమ్మడి విశాఖ జిల్లాలోని పాఠశాలల్లో అవకాశం కల్పించారు. ముందుగా డీఈవో చాంబరులో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సమక్షంలో అభ్యర్థుల ప్రాధాన్యతా ప్రకారం గ్రూపులను పిలిపించి స్క్రీన్‌పై ఖాళీలు ప్రదర్శించారు. ఆయా ఖాళీలను ఉపాధ్యాయులు కోరుకునే వీలు కల్పించారు. ఈ సందర్భంగా డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ పారదర్శకంగా కౌన్సెలింగ్ చేపట్టినట్లు తెలిపారు. ఇందులో కొందరికి మైదాన ప్రాంతాలు, మరికొందరికి ఏజెన్సీల్లో ప్రాంతాల్లో అవకాశం కల్పించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని.. సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

**1988 బ్యాచ్ ఉపాధ్యాయుల ఆందోళన..**

2008 బ్యాచ్ ఉపాధ్యాయులకు మైదాన ప్రాంతంలో ఉన్న ఖాళీలను కేటాయించి.. తమను మాత్రం ఏజెన్సీకి వెళ్లమంటున్నారని 1998 బ్యాచ్ ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. తామంతా 50 ఏళ్లు దాటిన వారమని, ఏజెన్సీలో పనిచేయడం కష్టమవుతుందన్నారు. తమకు కూడా మైదాన ప్రాంతాల్లో నియమించాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ప్రాధాన్యతాక్రమంలో కౌన్సెలింగ్ చేపట్టామన్నారు. కేటాయించిన చోట్ల విధుల్లో చేరాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# పలు రైళ్ల రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

**తాటిచెట్లపాలెం:** ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 24న హౌరా–తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎర్నాకుళం (22877) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24, 25వ తేదీల్లో షాలిమార్–హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25న సంత్రగచ్చి–మంగుళూరు (22855) ఎక్స్‌ప్రెస్, హౌరా–పుదుచ్చేరి (12867) ఎక్స్‌ప్రెస్, తిరుపతి– హౌరా (22890) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న సికింద్రాబాద్–అగర్తలా (07030) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

- వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధిలో భద్రతా కారణాల వలన ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి జూలై 1వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 25 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 26 నుంచి జూలై 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

**ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు**

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బరౌని–కోయంబత్తూర్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె త్రిపాఠి తెలిపారు. బరౌని– కోయంబత్తూర్(03357) వీక్లీ స్పెషల్ బరౌనిలో ప్రతీ శనివారం రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారు 3 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.20 గంటలకు బయల్దేరి మంగళవారం తెల్లవారుజాము 4 గంటలకు కోయంబత్తూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు నడుస్తుంది. కోయంబత్తూర్– బరౌని (03358) వీక్లీ స్పెషల్ కోయంబత్తూర్‌లో ప్రతీ బుధవారం తెల్లవారు 12.50 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 11.35 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 6 గంటలకు బరౌని వెళ్తుంది.

**వారణాసి రైలు పొడిగింపు**

కాశీ వీక్లీ రైలును మరికొంత కాలం పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం–వారణాసి(08588) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు సాయంత్రం 4.30 గంటలకు వారణాసి(బనారస్) చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూలై 5, 7వ తేదీల వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో వారణాసి–విశాఖపట్నం (08587)వీక్లీ స్పెషల్ ప్రతీ గురువారం సాయంత్రం 6 గంటలకు వారణాసిలో బయలుదేరుతుంది. మరుసటి రోజు రాత్రి 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు జూలై 6, 13 తేదీల వరకు పొడిగించారు.